## పేరు మీరే పెట్టండి

**అనేక పత్రికలు, నవలలు చదివే మీలోని ఊహాశక్తిని ఉపయోగించండి. ఈ కింది కథ చదివి దానికి ఏ పేరు పెడితే బావుంటుందో ఊహించి కింది బాక్సులో మీరే రాయండి.**

బజార్లో పనిముగించుకుని నాకు తెలిసిన ఓ స్టెయిన్‌లెస్ స్టీల్ షాపుకి వెళ్ళాను. ఆ షాపు ఓనరు నన్ను చూసి విష్ చేసి కూర్చోమని కుర్చీ చూపాడు. అతనితో పెద్దగా పరిచయం ఏంలేదు. మా అమ్మాయి కాపురానికి పంపడానికి స్టీలు వస్తువులు ఆ షాపులో కొన్నాను. ఆ తర్వాత రెండురోజులకు అతనికి ఏదో లోన్ అవసరమయ్యి మా బేంక్‌కి వచ్చాడు. అప్పటినుండి నన్ను ఎక్కడ చూసినా విష్ చేస్తాడు. వీలయితే కూల్‌డ్రింకో, టీయో ఇప్పిస్తాడు.

"ఏమిటి సార్! ఇలా వచ్చారు" అని ప్రశ్నించాడు అతను.

"బజారు పనిమీద వచ్చాను. పని పూర్తయింది. అలా మీ షాపుకొచ్చి మిమ్మల్ని చూసిపోదామని...." అన్నాను.

"చాలా సంతోషం! ఈ రోజు మా అతిథి మీరు." అంటూ వెంటనే కూల్‌డ్రింక్ తీసుకు రమ్మని కుర్రాణ్ణి పంపాడతను.

ఇంతలో ఎవరో ఏవో కొనటానికి వస్తే "ఒక్క నిమిషం" అంటూ వారికి ఏవో స్టీలు సామాన్లు చూపించాడు. వారు కొన్నింటిని సెలక్ట్ చేశారు. రేటు సెటిల్ అయి డబ్బు చెల్లించిన తర్వాత వాళ్ళు వెళ్ళిపోబోతుంటే "ఆగండి! ఆ వస్తువుల మీద మీ పేరు వేస్తాను ఇవ్వండి" అంటూ మిషన్ తీసి వేశాడు.

ఆ తర్వాత మరెవరో ఏదో ఫంక్షనుందని పంచడానికి చాలా ఎక్కువ సంఖ్యలో స్టీలు సామాన్లు తీసుకున్నారు. వారికి అన్ని వస్తువుల మీద ఓపికగ్గా "ప్రెజెంటెడ్ బై" అని వారి పేరు మిషన్‌తో రాశాడు.

అలా నేను అక్కడ కూర్చున్న కొద్దిసేపటిలో అమ్మిన అన్ని వస్తువులకీ పేర్లు వేసి మరీ అమ్మాడు.

ఆ తర్వాత అతను నా దగ్గరికి వచ్చినప్పుడు "నేను ఒకటడుగుతాను. మరేం అనుకోకుండా జవాబు చెబ్తారా?" అన్నాను.

"మీరడగడం నేను చెప్పకపోవడమూనా? అడగండి" అన్నాడు.

"మరేంలేదు. మీరు స్టీలు వస్తువులు ఎందరికో అమ్ముతున్నారు కదా! ప్రతి వస్తువుకి పేరు రాయకుండా ఇవ్వడం లేదేం? వాడు మరచిపోయినా అక్కర్లేదంటున్నా ఎక్కువ సంఖ్యలో కొన్నా పేరు రాయకుండా ఇవ్వలేదు. పేరు రాయకుండా ఇస్తే మీకు ఏదైనా నష్టముందా?" అన్నాను.

దానికతను నవ్వుతూ "మీరు గొప్ప ఇబ్బంది పెట్టే ప్రశ్నే అడుగుతున్నారు. అయినా జవాబు చెబ్తాను. మేము మా నగర వస్తువుకొన్న ప్రతి ఒక్కరికీ పేరు రాసి ఇవ్వడంవల్ల మాకు లాభమే కలుగుతుంది. ఒకసారి పేరు రాసిచ్చిన వస్తువును తిరిగి వాపసు తీసుకోం కదా! ఆ విధంగా దానిని వారు తీసుకురావడం, మార్పుమని కోరడం తప్పుతుంది. అంతేకాదు! మేము ప్రక్కషాపులో కంటే ఏదైనా ఎక్కువరేటుకి అమ్మామనుకోండి! వాళ్ళు లోగట్టా చేసి తిరిగొచ్చి వస్తువు తీసుకోమ్మన్నా, నచ్చలేదు మరొకటి మార్చమన్నా మార్చే అవసరం తప్పుతుంది. ఇవన్నీ లాభాలే కదా! వస్తువు కొన్నవాళ్ళు పేరు రాసి ఇస్తున్నామని సంతోషిస్తారు కాని ఇవన్నీ ఆలోచించరు" అంటుంటే అసలు విషయం అర్థమైంది నాకు!

—నారంశెట్టి ఉమామహేశ్వరరావు

గెద్దలుప్పి - 532 546
సీతానగరం (వయా) బొబ్బిలి (తా॥)
విజయనగరం (జిల్లా)

స్రవంతి నెం: 22లో ఈ శీర్షికలో ప్రచురించిన కథకి
రచయిత్రి : కాజ హనిత
పెట్టిన పేరు : తేలు కుట్టిన దొంగ

---

స్రవంతి నెం. 20లో ఇచ్చిన "ఇది నాలుగోసారి! ఈసారి చూసినా నీ ఆత్మహత్యా ప్రయత్నానికి నేనడ్డురాను" అన్నాడు శాయి లక్ష్మితో.
**వాక్యం ఆధారంగా రాసిన కథలు**

## రివర్స్ షాట్

"వాట్? ఆత్మహత్యలో ఉన్న థ్రిల్‌ను అనుభవించడానికి వచ్చావా?" అని ప్రశ్నించాడు శాయి.

"ఇంతకీ నీ పేరేంటి, అమ్మాయి?"

"లక్ష్మి."

"చూడమ్మా లక్ష్మి, లైఫ్‌ని ఎంజాయ్ చేయాలి కాని, పిరికిపందలా ఆత్మహత్య చేసుకోకూడదు. అయినా ఆత్మహత్య మహాపాపం..." ఇలా ఆ అమ్మాయికి నచ్చచెప్పి పంపించాడు. ఒక నిండు ప్రాణిని నిలబెట్టానన్న తృప్తితో ఇంటి ముఖంపట్టాడు.

టాంక్‌బండ్‌పై కూర్చుని, సరదాగా చుక్కలు లెక్కపెడ్తున్న శాయి, తనకు పది అడుగుల దూరంలో ఎవరో ఉన్నట్టు గమనించాడు. ఎవరో తెలుగింటి ఆడపడుచు! ఆత్మహత్య కేస్ అయి ఉంటుంది! ఏం కష్టం వచ్చిందో? పాపం!!

పరీక్షగా చూశాడు. "ఆ అమ్మాయే!" అతని కళ్ళు అగ్నిగోళాల్లా మారిపోయాయి. చరాచరా ఆమె దగ్గరకు వెళ్ళి, "ఇది నాలుగోసారి! ఈసారి చూసినా నీ ఆత్మహత్యా ప్రయత్నానికి నేనడ్డు రాను తక్షణం ఇక్కడనుంచి వెళ్ళిపో" అంటూ విసురుగా ఆ అమ్మాయిని తోసాడు శాయి.

"ఏంటయ్యా నీ గోల? నెల రోజుల నుంచి చూస్తున్నాను. వచ్చిన ప్రతిసారి, నేనేదో ఆత్మహత్య చేసుకుంటున్నానని అడ్డుపడతావ్. చేస్తున్న దరిద్రపు వృత్తిని మరచిపోయి, వారానికి ఒకసారి ప్రశాంతంగా గడుపుదామనుకుంటే, నువ్వొచ్చి నా మనసు పాడుచేస్తావ్? ఇంకోసారి ఇలా చేసావంటే పోలీసులకు పట్టిస్తా. జాగ్రత్త! అయినా ఈ మధ్య రోడ్‌సైడ్ రోమియోలు ఎక్కువైపోయారు." అంటూ విసావిసా ఆమె వెళ్ళిపోతుంటే తన చెవుల్నీ - కళ్ళనీ నమ్మలేక ఆమెవైపే చూస్తూ నిల్చున్నాడు శాయి. ●

—టి. రాజు

1-8-133, బాలసముద్రం
హనుమకొండ - 506 001,
వరంగల్లు (జిల్లా)

## మనసుంటే మార్గం

బావిలోకి దూకబోతున్న లక్ష్మి, శాయి బలంగా భుజాలుపట్టి ఆపడంతో వెనుదిరిగి అతణ్ణి కౌగిలించుకొని వెక్కివెక్కి ఏడవసాగింది.

శాయి మోహంలో ఏ భావమూలేదు... "లోపలికి పద" అన్నాడు. ఏడుపు ఆపి అతణ్ణోసారి చిత్రంగా చూసి, మౌనంగా అతడిని అనుసరించింది.

"ఇది నాలుగోసారి. ఈసారి చూసినా, నీ ఆత్మహత్యా ప్రయత్నానికి నేనడ్డురాను" అన్నాడు శాయి, లక్ష్మితో.

లక్ష్మిలోని దుఃఖం చెలియలికట్ట దాటి ఉధృతమయింది.

'మరి ఇప్పుడు మాత్రం ఎందుకొచ్చారు' వెక్కిళ్ళమధ్య అడిగింది. జాలిగా చూశాడామెవంక శాయి.

"లక్ష్మి- నువ్వు చంపుకోవలసింది నిన్ను కాదు— నీలోని ఆత్మన్యూనతాభావాన్ని- ఇక మనకి పిల్లలుపుట్టరన్నదే కదా నీ బాధంతా. నాలో ఏ లోపంలేదని డాక్టర్లు చెప్పగానే, నాకు నువు పనికిరాకుండా పోతావా? కేవలం పిల్లల్ని కనడానికేనా నిన్ను నేను కట్టుకొన్నది- నన్ను ఒంటరి వాణ్ణిచేసి ఎలా వెళ్ళిపోదామనుకొన్నావ్? నా ప్రేమనంతా గడ్డిపరకగా ఎలా తీసి పారేయగలిగావ్?

నాకుద్యోగం లేని రోజుల్లో దారిద్ర్యానికి జడిసి ఓసారి, అమ్మపెట్టే బాధలు భరించలేక ఓసారి, నిన్ను కట్నం తెమ్మంటూ— అది తేలేదంటూ మా వాళ్ళు, నేను ఊళ్ళో లేనప్పుడు నిన్ను మీ పుట్టింటికి తరిమేశారని ఓసారి, ఆత్మహత్యా ప్రయత్నాలు చేశావ్- నా అదృష్టం బావుండి అప్పుడు నిన్ను రక్షించుకోగలిగాను...

ఏదో అన్ని బాధలు తీరి- ఏ కలతలూ లేకుండా హాయిగా ఇద్దరం ఉంటున్న ఈ తరుణంలో- ఏదో పనిలేని అమ్మలక్కలు నిన్ను గొడ్రాలన్నారనీ- మళ్ళీ ఆత్మహత్య చేసుకోబోయావ్. నీలో ప్రేమించే మనసుందికదా? నన్నే ఓ పసివాడిలా లాలించు! నీలోని తల్లిప్రేమనంతా చూపించు! అలా కాదూ పసిపాపే కావాలంటే- ఎన్ని అనాథాశ్రమాలు లేవు? ఏ పాపనో, బాబునో తెచ్చి పెంచుకొందాం! సరేనా?" అన్నాడు లక్ష్మిని దగ్గరకు తీసుకుని లాలిస్తూ...

మిలమిల మెరిసే కళ్ళతో సరేనంటూ తలూపింది లక్ష్మి. "ఇంకోసారి ఇలాంటి ప్రయత్నం చేస్తే- నిన్ను నేనూ అనుసరించాల్సి ఉంటుంది సుమా" అంటున్న అతని పెదవుల్ని మాటమధ్యలో మూసేసింది లక్ష్మి...... తన తెలివితక్కువతనానికి సిగ్గుపడుతూ. *

—వాలి హిరణ్మయీదేవి

21 - 22 శ్రీరామా టవర్స్
4-1-896, తిలక్‌రోడ్డు,
హైదరాబాదు-1

ఈవారం ఈ శీర్షికలో కథల ఎన్నికల గెస్ట్ ఎడిటర్ :
శ్రీ శివల జగన్నాథరావ్

"చమత్కారంలో కూడా 'కారం' వుండాలి"

ఇది రచయితగా నా అభిప్రాయం! నేను నమ్మే సూత్రంకూడాను.

ఈ వాక్యం చాలనుకుంటాను: కథలు ఎట్లా వుండాలి? అని నేను చెప్పటానికి. ఈ శీర్షికకి, నా జడ్జిమెంటులో, భావానికి, స్పష్టతకి, వెరయిటీకి ప్రాధాన్యత ఇవ్వటం జరిగింది.

వచ్చిన చాలా కథలలో, 'కథ రాయటం'లో కొత్త రచయితలు ప్రగతి సాధించేరని చెప్పవచ్చు.

అయితే భావాన్ని హృద్యంగా, చురుక్కుమన్పించే విధంగా చెప్పిన ఇద్దరు— టి. రాజు గారు, వాలి హిరణ్మయీదేవిగారు వీరి కథల్ని ఎన్నిక చేశాను.

'రివర్స్ షాట్' కథ గన్‌షాట్‌లా దూసుకుపోతుంది. ఈ కథలో వేశ్య తన బ్రతుకునుండి విముక్తికోసం చేసే ఆత్మహత్యా యత్నంలో ఆమెని రక్షించబోయే శాయి చివర్న షాక్ తింటాడు.

"మనసుంటే మార్గం...." కథతో రచయిత్రి దారిద్ర్యం చావు, అత్త ఆరళ్ళవల్ల చావు, అనుమానం చావు, ఇలా ఎన్నో సమస్యల్ని వాక్యాల్లో చూపించి, చివర్న మరణంనించీ విముక్తురాల్ని చేశారు లక్ష్మిని. ఇందులో క్లుప్తత ఆకర్షణీయాంశాలు. ఇకపోతే—

నావృత్తి, ప్రవృత్తి అంతా సాహిత్యమే! "సాన్నిహిత్యాన్ని అనేకమంది సహృదయులతో కల్గించేది సాహిత్యం!' రచయితగా 1966లో జన్మించేను. మినీకథ, పెద్దకథ, నవల, నాటకం, రేడియో అన్ని రచనా ప్రక్రియలు చేసాను.

కథల ఎన్నికలో కొత్త అనుభూతిని కల్గించిన మల్లాదిగారికి నా ధన్యవాదాలు!

## ఓ కథ రాయండి

ఈ క్రింది ఇచ్చిన వాక్యాన్ని కథలో ఎక్కడైనా ఉపయోగించి అచ్చులో అరపేజీ మించకుండా ఓ కథరాసి వెంటనే పంపండి. ప్రచురణార్హమైన కథా రచయితలకి పాతిక రూపాయలు పారితోషికం పంపబడుతుంది.

"జయ కొడుకు బాధ్యత మీరు తీసుకుంటానంటే జయను తేసికెళ్ళడానికి నేనెప్పుడూ సిద్ధమే," మామగారితో చెప్పాడు ఆనంద్ తన నిర్ణయాన్ని.

